ANDHRAJYOTHY
5

అనకాపల్లి
జిల్లా వార్తలు
శనివారం 14 సెప్టెంబరు 2024

ఏపీ ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్‌లకు 15 వరకు గడువు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 13: ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల అయినట్టు డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్లు జూలై 31న ప్రారంభం అయినప్పటికీ ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 15వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. రూ.200 అపరాధ రుసుముతో ఈ నెల 25వ తేదీ వరకు గడువు వుందని, ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఆమె తెలిపారు.

తహసీల్దార్ల బదిలీలపై తర్జనభర్జన

నగరం/మైదానం నుంచి ఏజెన్సీకి వెళ్లబోమంటున్న జూనియర్లు

- నేతల ద్వారా సిఫారసులు
- మరోవైపు పాడేరు డివిజన్ నుంచి ఏడుగురిని మైదాన ప్రాంతానికి పంపేందుకు అల్లూరి జిల్లా అధికారులు సుముఖం
- ఐటీడీఏ నిబంధనలు అమలుచేయాలని కోరుతున్న ఏజెన్సీ తహసీల్దార్లు
- ఇటు నుంచి ముగ్గురినే పంపుతారని ప్రచారం
- త్వరలో మూడు జిల్లాల కలెక్టర్ల భేటీ



విశాఖపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): **ఉమ్మడి జిల్లాలో జూనియర్లు అయిన తహసీల్దార్లు కొందరు నగరం, మైదాన ప్రాంతం నుంచి ఏజెన్సీకి వెళ్లేందుకు ససేమిరా అంటున్నారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పనిచేస్తాం తప్ప ఏజెన్సీ మండలాలకు వెళ్లలేమని తెగేసి చెబుతున్నారు. అదే సమయంలో ఏజెన్సీ నుంచి మైదానం/నగర ప్రాంతాలకు బదిలీ చేయాల్సిందిగా వచ్చిన దరఖాస్తుల్లో ఏడింటిని అల్లూరి జిల్లా యంత్రాంగం పరిగణనలోకి తీసుకున్నట్టు తెలిసింది.**

ఎన్నికల ప్రక్రియ ముగిసిన తరువాత ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి తహసీల్దార్లు రాగా ఒక్క విశాఖ జిల్లాలోనే పోస్టింగ్స్ ఇచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్, ఆ తరువాత వర్షాలు, వరదలు రావడంతో అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ఇంకా పోస్టింగ్స్ ఇవ్వలేదు. ఈలోగా బదిలీలకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడంతో అల్లూరి జిల్లా పాడేరు డివిజన్‌లో పనిచేస్తున్న తహసీల్దార్లు మైదానం, నగరానికి వచ్చేందుకు దరఖాస్తు చేసుకున్నారు. నిబంధనల ప్రకారం ఐటీడీఏ పరిధిలో ఉద్యోగి/అధికారి ఏకకాలంలో రెండేళ్లకు పైబడి పనిచేసినా...వయస్సు 50 ఏళ్లు దాటినా మైదాన ప్రాంతానికి బదిలీ చేయాలి. ఈ నిబంధనల ప్రకారం పాడేరు ఏజెన్సీలో పనిచేస్తున్న ఎనిమిది మంది తహసీల్దార్లు బదిలీకి అర్హులుగా తేలారు. అందులో ఒకరు అక్కడే పనిచేయడానికి సుముఖత (స్పౌజ్ అక్కడే టీచరుగా పనిచేస్తున్నారు) వ్యక్తంచేయడంతో మిగిలిన ఏడుగురినీ అక్కడ నుంచి రిలీవ్ చేయడానికి అల్లూరి జిల్లా కలెక్టర్ సుముఖత వ్యక్తంచేశారని అంటున్నారు. ఏజెన్సీ నుంచి ఎంతమంది తహసీల్దార్లు కిందకు వస్తారో...అంతమందిని మైదానం/నగరం నుంచి ఏజెన్సీకి వెళ్లాలి. కానీ మైదానం/నగరంలో పనిచేస్తున్న తహసీల్దార్లు (50 ఏళ్ల కంటే తక్కువ వయస్సు, గతంలో ఏజెన్సీలో ఎప్పుడు పనిచేయనివారు) ఏజెన్సీకి వెళ్లేందుకు సుముఖంగా లేరని రెవెన్యూ వర్గాల్లో ప్రచారం సాగుతుంది. కొతమంది రాజకీయంగా తమకు ఉన్న పలుకుబడిని ఉపయోగించి ఇక్కడే కొనసాగేందుకు అన్ని రకాలుగా పైరవీలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నగరంలో ఐదారుగురు తహసీల్దార్లు సర్వీస్‌లో బాగా జూనియర్లు. వారు కూడా కదలంటున్నారు. అయితే 58 ఏళ్లు దాటిన తహసీల్దారును మాత్రం ఏజెన్సీకి పంపేందుకు యత్నిస్తున్నట్టు తెలిసింది. అలాగే అనకాపల్లి జిల్లా నుంచి 55 ఏళ్లు దాటిన ఇద్దరు తహసీల్దార్లను ఏజెన్సీకి పంపాలని యత్నిస్తున్నారని చెబుతున్నారు. మరోవైపు బదిలీల విషయంలో ఐటీడీఏ నిబంధనలు అమలు చేయాలని, లేకపోతే న్యాయపోరాటం చేస్తామని ఏజెన్సీలో పనిచేస్తున్న కొందరు తహసీల్దార్లు అంటున్నట్టు తెలిసింది.

ఇదిలావుండగా నగరంలో పనిచేస్తున్న ముగ్గురు తహసీల్దార్లు అనకాపల్లి జిల్లాకు వెళ్లేందుకు సుముఖత వ్యక్తం చేశారు. కూటమికి చెందిన ప్రముఖుడొకరు తన నియోజకవర్గంలో పనిచేయాలని సూచించడంతో ఒకరు, మరో ఎమ్మెల్యే కోర్కె మేరకు ఇంకొక తహసీల్దారు అనకాపల్లి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. గతంలో ... మిగతా 8వ పేజీలో

మిగులు టీచర్లు 39 మంది

'నర్సీపట్నం'లో లెక్కలు తేల్చిన విద్యా శాఖ అధికారులు

- సగటున 30 మంది విద్యార్థులకు ఒక టీచర్
- నర్సీపట్నం టౌన్, రూరల్‌లో 7,150 మంది విద్యార్థులు
- 21 మంది ఎస్ఏలు, 18 మంది ఎస్‌జీటీలు మిగులు


మిగులు ఉపాధ్యాయులు ఉన్న గురందొరపాలెం యూపీ స్కూల్

నర్సీపట్నం, సెప్టెంబరు 13: ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ల(ఎస్ఏ)ను జడ్పీ ఉన్నత పాఠశాలలకు సర్దుబాటు చేసి, ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా ఎస్‌జీటీల నియామకాలు పూర్తి చేసిన తర్వాత జిల్లా వ్యాప్తంగా చాలా మంది ఉపాధ్యాయులు అదనంగా వుండిపోయారు. ప్రభుత్వ జీవో ప్రకారం పాఠశాలలో 20 మందిలోపు విద్యార్థులు ఉంటే ఒక టీచర్, 21 నుంచి 60 మంది వరకు పిల్లలు వుంటే ఇద్దరు టీచర్లు, 61 నుంచి 90 మందిలోపు విద్యార్థులు వుంటే ముగ్గురు ఉపాధ్యాయులు ఉండాలి. నర్సీపట్నం మండలం, పట్టణంలో 15 ఉన్నత పాఠశాలలు, రెండు యూపీ స్కూళ్లు, 38 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఒకటి నుంచి పదో తరగతి వరకు 7,150 మంది విద్యార్థులు చదువు కుంటున్నారు. ఎస్ఏల సర్దుబాటు, ఎస్‌జీటీల కౌన్సెలింగ్ తరువాత 21 మంది ఎస్‌జీటీలు, 18 మంది ఎస్ఏలు.. మొత్తం 39 మంది అదనంగా వున్నట్టు విద్యా శాఖ అధికారులు లెక్కలు తేల్చారు. కానీ వాస్తవంగా ఎస్‌జీటీలు ఇంకా ఎక్కువ మందే వుంటారని అంటున్నారు.

విద్యార్థుల నిష్పత్తికన్నా అదనంగా టీచర్లు

నర్సీపట్నం మండలం మెట్టపాలెం ఎంపీపీ స్కూల్‌లో 21 మంది విద్యార్థులు వున్నారు. ఇక్కడ ఇద్దరు ఉపాధ్యాయులు సరిపోతారు. కానీ ప్రస్తుతం ఇక్కడ నలుగురు టీచర్లు ఉన్నారు. అలాగే అమలాపురం ఎంపీపీ స్కూల్‌లో 21 మంది విద్యార్థులకు ఐదుగురు ఉపాధ్యాయులు, వెంకునాయుడుపేట ఎంపీపీ పాఠశాలలో 61 మంది విద్యార్థులు నలుగురు ఉపాధ్యాయులు పాఠాలు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. ఉపాధ్యాయ సంఘాల నేతల ఒత్తిళ్లతో టీచర్ల సర్దుబాటు ప్రక్రియ అసంబద్ధంగా జరిగినట్టు విమర్శలు వస్తున్నాయి. జిల్లాలో మిగులు ఉపాధ్యాయుల వివరాల కోసం డీఈవో వెంకటలక్ష్మమ్మను ఫోన్‌లో సంప్రదించగా, సమాచారం అందుబాటులో లేదని చెప్పారు.

నిండుకుండల్లా చెరువులు

ఖరీఫ్‌కు ధోకా లేదంటున్న అన్నదాతలు

- పెద్ద చెరువుల కింద రబీకి కూడా నీరు
- భూగర్భ జలాలు గణనీయంగా వృద్ధి


నరసాపురం సమీపంలో పూర్తిగా నిండిన చెరువు

చోడవరం, సెప్టెంబరు 13: **ఆగస్టు చివరి వారం, ఈ నెల మొదటివారంలో వాయుగుండాల ప్రభావంతో భారీ వర్షాలు కురవడంతో వరద నీరు చేరి చెరువులు కళకళలాడుతున్నాయి. పలుగ్రామాల్లో చెరువులు ఇప్పటికే పూర్తిగా నిండిపోయి, అలుగులు పారుతున్నాయి. దీంతో ఖరీఫ్ వరి సాగుకు ధోకా వుండదని ఆయకట్టు రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.**


లక్ష్మీపురం చెరువు నిండడంతో ఇటీవల అలుగు మీదుగా బయటకు పోతున్న వరద నీరు

బంగాళాఖాతంలో గత పక్షం రోజుల్లో ఏర్పడిన ఉపరితల ద్రోణులు, అల్పపీడనాలు, వాయుగుండాల ప్రభావంతో జిల్లా అంతటా విస్తారంగా వర్షాలు కురిసిన విషయం తెలిసిందే. అనకాపల్లి జిల్లాకు ఆనుకుని వున్న అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో కుంభవృష్టిగా వర్షాలు కురవడంతో చోడవరం, మాడుగుల నియోజకవర్గాలోని పెద్దేరు, రైవాడ, కోనాం, కల్యాణపులోవ, తాండవ రిజర్వాయర్లు పూర్తిగా నిండాయి. ఇదే సమయంలో సాగునీటి చెరువుల్లో కూడా సమృద్ధిగా వరద నీరు చేరింది. అంతకు ముందు ఆగస్టు నెలలో మూడు వారాలపాటు వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో చెరువుల్లో అంతంతమాత్రంగానే నీరు వుంది. దీంతో వరి సాగు చేసే ఆయకట్టు రైతులు ఆందోళన చెందారు. ఇటువంటి తరుణంలో భారీ వర్షాలు కురిసి, చెరువులు నిండాయి. ప్రస్తుతం జిల్లాలో ఎక్కడ చూసినా సాగునీటి చెరువులు నిండు కుండలను తలపిస్తున్నాయి. దాదాపు అన్ని చెరువులు నిండిపోయి అలుగులు (పొర్లుకట్ట) పారుతున్నాయి. దీనివల్ల ఖరీఫ్ వరిసాగుకు నీటి కొరత వుండదని, అంతేకాక భూగర్భ జలాలు బాగా వృద్ధి చెందుతాయని రైతులు చెబుతున్నారు. పెద్ద చెరువులు, ఆవలు వున్న ప్రాంతాల్లో రబీ పంటకు కూడా నీరు అందుబాటులో వుంటుందని ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.


నిండుకుండలా దర్శనమిస్తున్న చోడవరం పట్టణంలో పాత చెరువు


కుంకుమ అలంకరణలో స్వయంభూ విఘ్నేశ్వరుడు

స్వయంభూ విఘ్నేశ్వరునికి కుంకుమ అలంకరణ

వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజైన శుక్రవారంనాడు చోడవరంలోని స్వయంభూ విఘ్నేశ్వరుడు కుంకుమ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు కొడమంచిలి చలపతి కుంకుమ అలంకరణలో స్వామిని ముస్తాబు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి స్వయంభూ విఘ్నేశ్వరుడిని దర్శించుకుని పూజలు చేశారు. - చోడవరం

తాగునీటి సమస్యపై రోడ్డెక్కిన మహిళలు

- ఖాళీ బిందెలతో కోటవురట్లలో నిరసన
- ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం
- వరహా నదిలో నీరు తగ్గితేగానీ కొత్త పైప్‌లైన్ సాధ్యం కాదంటున్న అధికారులు

- 7లో

రూ.లక్షలు వ్యయం.. ఏడాదిగా నిరుపయోగం

అందుబాటులోకి రాని పశువైద్య కేంద్రం నూతన భవనం

- రూ.32 లక్షల ఆర్ఐడీ నిధులతో నిర్మాణం
- గత ఏడాది జూన్‌లో ప్రారంభించిన అప్పటి మంత్రులు
- ఆస్పత్రికి వెళ్లేదారిలో గెడ్డ.. పశువులు, రైతులు దాటలేని పరిస్థితి
- వంతెన నిర్మించడంలో నాటి పాలకులు విఫలం
- శిథిల భవనంలోనే కొనసాగుతున్న పశువైద్యశాల


ఏడాది నుంచి నిరుపయోగంగా ఉన్న పశువైద్య కేంద్రం నూతన భవనం

నాతవరం, సెప్టెంబరు 13: **లక్షలాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన పశువైద్యశాల నూతన భవనం గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఏడాది దాటినా వినియోగంలోకి రాలేదు. రహదారి నుంచి ఆస్పత్రిలోకి వెళ్లే దారిలో వున్న గెడ్డపై వంతెన నిర్మించకపోవడంతో రైతులు పశువులను తీసుకుని వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో శిథిలావస్థకు చేరిన పాత భవనంలోనే పశువైద్యశాలను కొనసాగిస్తున్నారు.**


పశువైద్య కేంద్రానికి వెళ్లే దారిలో వంతెన నిర్మించాల్సిన గెడ్డ ఇదే

మండల కేంద్రం నాతవరంలో పశువైద్యశాల భవనం పాతబడిపోవడంతో రైతుల వినతి మేరకు కొత్త భవనం నిర్మాణానికి నాబార్డు.. 'గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధులు' నుంచి రూ.32 లక్షలు మంజూరు చేసింది. అధికారులు టెండర్లు పిలిచి, కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. శంకుస్థాపన చేసిన తరువాత పనులు అలస్యంగా జరిగాయి. ఎట్టకేలకే గత ఏడాది జూన్‌లో పనులు పూర్తికావడంతో అప్పటి మంత్రులు బూడి ముత్యాలనాయుడుగుడివాడ అమర్‌నాథ్, స్థానిక ఎమ్మెల్యే గణేశ్ కలిసి ఆర్భాటంగా భవనాన్ని ప్రారంభించారు. అయితే పశువైద్య కేంద్రానికి, రోడ్డుకి మధ్యలో నాలుగైదు అడుగుల లోతున చిన్నపాటి గెడ్డ వుంది. దీనిపై వంతెన నిర్మించకపోవడంతో పశువులతోపాటు రైతులు కూడా గెడ్డ దాటడానికి వీలుకాదు. దీంతో పశువైద్యశాలను యథావిధిగా పాత భవనంలోనే కొనసాగించాల్సి పరిస్థితి నెలకొంది. నూతన భవనం అందుబాటులోకి వచ్చి ఏడాది దాటినా వినియోగంలోకి రాకపోవడంపట్ల రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు.. ఉపాధి హామీ పథకం కింద మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో వంతెన నిర్మాణానికి కృషి చేసి వుంటే ఆస్పత్రి నూతన భవనం వినియోగంలోకి వచ్చేదని అభిప్రాయపడుతున్నారు. కాగా నాతవరానికి చెందిన పలువురు రైతులు ఇటీవల స్థానిక ఎమ్మెల్యే, శాసనసభ స్పీకర్ అయిన చింతకాయల అయ్యన్నపాత్రుడుని కలిసి, పశువైద్యశాల వద్ద గెడ్డపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని కోరారు.

విశ్రాంత ఉపాధ్యాయిని సేవా నిరతి

- పనిచేసిన పాఠశాలలో రూ.4 లక్షలతో కళావేదిక నిర్మాణం
- కొనియాడిన గ్రామస్థులు.. ఘనంగా సత్కారం


విశ్రాంత ఉపాధ్యాయిని పద్మావతిని సన్మానిస్తున్న గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు


పాఠశాలలో నిర్మించిన కళావేదిక

ఎస్.రాయవరం, సెప్టెంబరు 13: మండలంలోని ధర్మవరం అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేసిన లోకారెడ్డి పద్మావతి పాఠశాలకు తనవంతుగా ఏదైనా సాయం చేయాలని భావించారు. పదవీ విరమణ తరువాత సుమారు నాలుగు లక్షల రూపాయల సొంత నిధులతో తన తండ్రి కోవెల స్వామి జ్ఞాపకార్థం కళావేదికను నిర్మించారు. శుక్రవారం కుటుంబ సభ్యులు, గ్రామపెద్దలు, పాఠశాల ఉపాధ్యాయుల సమక్షంలో కళావేదికను ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మావతి ఉదారతను పలువురు కొనియాడి, ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బి.శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ కె.మాణిక్యం, విద్యా కమిటీ చైర్మన్ ఆదినారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శభాష్ పోలీస్

బాలికను ఢీకొని పరారైన వ్యాన్ డ్రైవర్ 24 గంటల్లోనే పట్టివేత

- బుచ్చెయ్యపేట మండలం కోమళ్లపూడిలో 11వ తేదీ సాయంత్రం ఘటన
- వ్యాన్‌తోసహా ఉడాయించిన డ్రైవర్
- నిందితుడిని పట్టుకోవడానికి పలు బృందాలు ఏర్పాటు
- రావికమతం, మాడుగుల, పాడేరు, చింతపల్లి మండలాల మీదుగా సొంతూరు చేరిక
- గుండుపాల సరుగుడు తోటల్లో వ్యాన్ దాచిన వైనం
- సాంకేతిక ఆధారాలతో గుర్తించి, పట్టుకున్న పోలీసులు
- అభినందించిన జిల్లా ఎస్పీ



కోమళ్లపూడిలో బాలికను ఢీకొన్న వాహనం ఇదే. గొలుగొండ మండలం గుండుపాలలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. (ఇన్‌సెట్‌లో) కొత్తకోట సీఐ కోటేశ్వరరావు

రావికమతం/ బుచ్చెయ్యపేట, సెప్టెంబరు13: **బుచ్చెయ్యపేట మండలం కోమళ్లపూడి వద్ద బుధవారం సాయంత్రం ఆరేళ్ల బాలికను ఢీకొట్టి పరారీ కావడమే కాకుండా, ఆమె మృతికి కారకుడైన వ్యాన్ డ్రైవర్‌ను పోలీసులు పట్టుకున్నారు. సంఘటన జరిగిన 24 గంటల్లోనే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రమాదానికి కారణమైన వాహనాన్ని సీజ్ చేసి, నిందితుడిని అరెస్టు చేశారు. ఈ మేరకు కొత్తకోట సీఐ కోటేశ్వరరావు శుక్రవారం విలేకరులకు వివరాలను వెల్లడించారు. ఆయన చెప్పిన సమాచారం ప్రకారం...**

గొలుగొండ మండలం గుండపాల గ్రామానికి చెందిన మర్రా రెడ్డిమయ్య టాటా ఏస్ వాహనంపై సరకులు రవాణా చేస్తుంటాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం నర్సీపట్నం నుంచి చోడవరానికి ఎరువులు తీసుకువెళ్లాడు. తిరుగు ప్రయాణంలో బుచ్చెయ్యపేట మండలం కోమళ్లపూడి వద్ద రోడ్డు దాటుతున్న గొన్నా మహాలక్ష్మినాయుడు కుమార్తె షర్మిల దుర్గ(6)ను బలంగా ఢీకొన్నాడు. దీంతో బాలిక తీవ్రంగా గాయపడింది. వాహనాన్ని ఆపితే స్థానికులు కొడతారేమోనన్న భయంతో వ్యాన్‌తో సహా పరారయ్యాడు. గాయపడిన బాలికను ఆమె తండ్రి వెంటనే రావికమతం ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లాడు. కానీ పాప అప్పటికే మృతిచెందింది. అనంతరం ఈ సంఘటనపై బుచ్చెయ్యపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బాలిక మృతికి కారణమైన వాహనాన్ని, నిందితుడిని పట్టుకునేందుకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కొత్తకోట సీఐ ఆధ్వర్యంలో రావికమతం, కొత్తకోట, రోలుగుంట, బుచ్చెయ్యపేట ఎస్ఐలతోపాటు జిల్లా పోలీసు కార్యాలయం నుంచి వచ్చిన సాంకేతిక బృందం బుధవారం రాత్రే రంగంలోకి దిగాయి. కోమళ్లపూడిలో బాలికను ఢీకొన్న వాహనం వివరాలను ప్రత్యక్ష సాక్షుల నుంచి సేకరించి, ప్రమాదం జరిగిన సమయాన్ని పరిగణనలోకి తీసుకున్న పోలీసులు, పలుమార్గాల్లో సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. సాంకేతిక ఆధారాలతో ప్రమాదానికి ... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

సైబర్ క్రైమ్‌పై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 13: సైబర్ క్రైమ్‌పై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించి సీఐ టీవీ విజయ్‌కుమార్ శుక్రవారం తెలిపిన వివరాలివి. మండలంలోని తుమ్మపాలకు చెందిన గరికిపాటి నాగవెంకట సాయి సతీష్ అనే వ్యక్తికి ఈ ఏడాది మే 15వ తేదీన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ మెసేజ్ వచ్చింది. ఇంటి వద్ద నుంచే జాబ్ చేసుకోవచ్చనని అజ్ఞాత వ్యక్తి లింక్ పంపాడు. దీంతో అతడు ఆ లింక్‌కు బయోడేటా పంపించాడు. సులువుగా డబ్బులు సంపాదించాలంటే లాభాలు వచ్చేలా పెట్టుబడులు పెట్టాలని ఆ మెసేజ్‌లో ఉంది. దీంతో సతీష్ ఆ లింకులో పేర్కొన్న అకౌంట్‌కు రూ.10 వేలు పంపాడు. అవతలి వ్యక్తి రూ.4,499 నీకు లాభం వచ్చిందని తిరిగి సతీష్‌కు పంపాడు. దీంతో 16 నుంచి 21వ తేదీ వరకు దఫదఫాలుగా రూ.5.68 లక్షలు అజ్ఞాత వ్యక్తి సూచించిన అకౌంట్‌లో సతీష్ డిపాజిట్ చేశాడు. ఇంకా డిపాజిట్ చేయమని కోరుతుండడంతో అనుమానం వచ్చి మే 21వ తేదీన సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు ఫిర్యాది పంపిన మొత్తంలో రూ.లక్షా 19వేలు అజ్ఞాత వ్యక్తి అకౌంట్‌కు వెళ్లకుండా ఫ్రీజ్ చేశారు. ఇదిలావుంటే, ఈ ఘటనపై గురువారం రాత్రి బాధితుడు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

50 కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు



విలేకరులతో మాట్లాడుతున్న సీఐ హిమగిరి, వెనుక గంజాయి నిందితులు

అరకులోయ, సెప్టెంబరు 13: ఒడిశా నుంచి విశాఖపట్నం వెళ్తున్న వాహనంలో గంజాయి తరలిస్తూ ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారని సీఐ హిమగిరి తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. గురువారం సాయంత్రం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా కేరళకు చెందిన నజీబ్, ఒడిశా రాష్ట్రం చిత్రకుట్‌కు సమీపంలో ఉన్న బడపదర్ గ్రామానికి చెందిన కమ్మనస్ సీసా కారులో 50 కిలోలు గంజాయి తరలిస్తుండగా పట్టుబడ్డారన్నారు. ఈ గంజాయి చిత్రకుట్ ప్రాంతంలో కొనుగోలు చేసి విశాఖపట్నం మీదుగా కేరళకు తరలించే ప్రయత్నంలో పట్టుబడినట్టు చెప్పారు. ఈ గంజాయి విలువ సుమారు రూ2 లక్షలు ఉంటుందన్నారు. 50 కిలోల గంజాయితో పాటు కారును స్వాధీనం చేసుకుని ఇద్దర్ని అరెస్టు చేశామని సీఐ చెప్పారు. ఈ సమావేశంలో ఎస్ఐ ఆర్.సంతోశ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో ఆరు కిలోల గంజాయి స్వాధీనం

అనంతగిరి, సెప్టెంబరు 13: ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతానికి ఆర్టీసీ బస్సులో తరలిస్తున్న గంజాయి పట్టుకున్నట్టు ఎస్ఐ కరక రాము తెలిపారు. డముకు చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అరకు వైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సులో ఉత్తరప్రదేశ్‌కు చెందిన రుద్రప్రతాప్‌సింగ్ నుంచి ఆరు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. మరో నిందితుడు రిషబ్ దివ్వేది పరారీలో ఉన్నాడన్నారు. గంజాయిని ఓడిస్సా రాష్ట్రం పాడువా వద్ద కొనుగోలు చేసినట్టు దర్యాప్తులో తేలిందని చెప్పారు. రుద్రప్రతాప్‌సింగ్‌ను కోర్టులో హాజరుపరచగా, రిమాండ్ విధించినట్టు ఎస్ఐ తెలిపారు.

రైలు నుంచి జారిపడి ఒకరికి గాయాలు



గాయపడ్డ రామునాయుడు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 13: గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న ఒక వ్యక్తి శుక్రవారం ప్రమాదవశాత్తు బోగీ నుంచి జారి పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి విశాఖ పట్టణం వెళ్తున్న గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కె.వెంకటాపురం గ్రామానికి చెందిన రామునాయుడు (37) ప్రయాణిస్తున్నాడు. బోగీ రద్దీగా ఉండడం వల్ల డోర్ వద్ద నిలబడి ఉన్నాడు. ఏలూరు సమీపంలో ప్రమాదవశాత్తు అతను జారిపడ్డాడు. తీవ్ర గాయాలకు గురైన అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు.

బీజేపీ సభ్యత్వ నమోదు విజయవంతం కావాలి

» కర్ణాటక మాజీ ఉప ముఖ్యమంత్రి అశోక్



సమావేశంలో మాట్లాడుతున్న కర్ణాటక మాజీ ఉప ముఖ్యమంత్రి అశోక్

కొత్తూరు, సెప్టెంబరు 13: బీజేపీ సభ్యత్వ నమోదును ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కర్ణాటక మాజీ ఉప ముఖ్యమంత్రి, ప్రస్తుత విధాన సభ ప్రతిపక్ష నాయకుడు ఆర్.అశోక్ పిలుపునిచ్చారు. శుక్రవారం అనకాపల్లి ఎంపీ క్యాంపు కార్యాలయంలో బీజేపీ సభ్యత్వ నమోదుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి బూత్‌లో లక్ష్యం దిశగా పని చేయాలన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశంలో దశాబ్ద కాలంగా బహ్మాండమైన అభివృద్ధి, సంక్షేమ పాలన సాగుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కోలార్ మాజీ ఎంపీ మునిస్వామి, ఎస్సీ మోర్చా నాయకులు దేవానంద, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జి కె.సురేంద్రమోహన్, జిల్లా అధ్యక్షుడు ద్వారపు రెడ్డి పరమేశ్వరరావు, పొన్నగంటి అప్పారావు, పట్టాభి పసాద్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు సబ్బవరం విద్యార్థిని ఎంపిక

సబ్బవరం, సెప్టెంబరు 13 : ఇక్కడి ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని కె.వెంకటలక్ష్మి రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైంది. విశాఖ జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 10న లంకెలపాలెంలో జరిగిన ఎంపిక ప్రక్రియలో ఆమె అద్భుతంగా రాణించి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించినట్టు పాఠశాల హెచ్ఎం తిరుపతిరావు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా పలాస మండలం వజ్రపు కొత్తూరు జెడ్పీ హైస్కూల్లో శనివారం నుంచి జరగనున్న పోటీల్లో తలపడుతుందని వివరించారు. ఈ సందర్భంగా శుక్రవారం అతనితో పాటు పీడీ అబ్దుల్ రెహ్మాన్, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ శంకరరావు, జ్యోతిశ్రీ, సిబ్బంది ఆమెను అభినందించారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

తాగునీటి సమస్యపై రోడ్డెక్కిన మహిళలు

» ఖాళీ బిందెలతో కోటవురట్లలో నిరసన

» ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీలు పట్టించుకోవడం లేదని ఆగ్రహం

» వరహా నదిలో నీరు తగ్గితేగానీ కొత్త పైప్‌లైన్ సాధ్యం కాదంటున్న అధికారులు



ఖాళీ బిందెలతో మహిళలు నిరసన ప్రదరన

కోటవురట్ల, సెప్టెంబరు 13: మేజర్ పంచాయతీ కోటవురట్లలో తాగునీటి సమస్యపై మహిళలు శుక్రవారం రోడ్డెక్కారు. ఖాళీ బిందెలతో నిరసన ప్రదర్శనగా వెళ్లి పంచాయతీ కార్యాలయం ఎదుట బైఠాయించారు. గ్రామానికి గత వారం రోజుల నుంచి తాగునీరు సరఫరా కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కోటవురట్ల శివారు గవరపేటలో వరహా నది



పంచాయతీ కార్యాలయంలో బైఠాయించిన మహిళలు

ఒడ్డున నిర్మించిన భారీరక్షిత మంచినీటి పథకం ట్యాంకు నుంచి గవరపేట, కోటవురట్ల పంటపొలాలు మీదగా వరహానది నుంచి సంతబయిలు, ముస్లిం తదితర వీధులకు తాగునీటి పైపులైన్ వేశారన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పైపులు వరహా నది ఉధృతికి కొట్టుకుపోయాయన్నారు. ఈ కారణంగా గ్రామానికి గత వారం రోజుల నుంచి నీటి సరఫరా నిలిచిపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నామన్నారు. అయినప్పటికీ పట్టించుకునేవారు కరువయ్యారని వాపోయారు. ఇదిలావుంటే, ఎగువన జలాశయాల నుంచి నీరు విడుదల చేయడంతో పాటు భారీ వర్షాలకు వరహానది ఉధృతంగా ప్రవహిస్తుంది. పైపులు కొట్టుకుపోవడంతో కొత్త పైప్‌లైన్ వేయాలంటే నదిలో నీరు తగ్గితే గాని సాధ్యం కాదని అధికారులు అంటున్నారు. భారీ వర్షాలు పడుతున్నప్పుడు పైప్‌లు కొట్టుకుపోతున్నా ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం లేదంటూ మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి సమయాల్లో దూర ప్రాంతం నుంచి నీటిని మోసుకుని రావడం కష్టంగా ఉందని తెలిపారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు ప్రతిరోజూ ట్యాంకర్ల ద్వారా తమకు నీటిని సరఫరా చేయాలని వారంతా డిమాండ్ చేశారు. అనంతరం ఆర్‌డబ్ల్యూస్ డీఈఈ, ఏఈలకు ఎంపీటీసీ పి.సూర్యారావు, గ్రామ మహిళలు సమస్యను వివరించారు.

పరిశ్రమల సహకారంతో దోమతెరల పంపిణీ

» జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్



జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 13: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా జిల్లాలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఉచితంగా దోమ తెరలు పంపిణీ చేయనున్నట్టు కలెక్టర్ విజయకృష్ణన్ శుక్రవారం ఇక్కడ తెలిపారు. పరిశ్రమల సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. సీఎస్ఆర్ నిధుల కింద అచ్యుతాపురం మెస్సర్ టయోస్సు రేర్ ఎర్త్స్ సంస్థ పదివేల దోమ తెరలను ప్రభుత్వ యంత్రాంగానికి అందజేశారన్నారు. అదేవిధంగా అరబిందో ల్యాబొరేటరీస్, జేఎన్‌పీసీ ఫార్మాసిటీ పరవాడ 2500 దోమ తెరలు అందజేశారన్నారు. జిల్లాలో 30వేల దోమ తెరలు పంపిణీకి వివిధ పరిశ్రమల యాజమాన్యాలను కోరినట్టు చెప్పారు. అందులో భాగంగా గత వారం పదివేల దోమ తెరలను బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల విద్యార్థులకు, మారుమూల గిరిజన ప్రాంతాల్లో నివసించే ప్రజలకు పంపిణీ చేశామని కలెక్టర్ వివరించారు. శుక్రవారం 12,500 దోమ తెరలను పైన పేర్కొన్న రెండు కంపెనీల హెచ్ఆర్ మేనేజర్లు మురళీధర్ రావు, రామకృష్ణలు డీఆర్‌వో బి.దయానిధి, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ రామారావు, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీధర్‌లకు అందజేశారని తెలిపారు. వీటి పంపిణీకి చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. పారిశ్రామికవేత్తల సహకారంతో మరిన్ని దోమ తెరలు పంపిణీ చేయనున్నామని ఆమె వివరించారు.

ఎండీఎం నిర్వాహకులపై నిర్బంధం తగదు

» నిర్వాహకుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి



విలేకరులతో మాట్లాడుతున్న గూనూరు వరలక్ష్మి

చోడవరం, సెప్టెంబరు 13: పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులపై అధికారులు అనవసర ఆంక్షలు పెడుతున్నారని, ఇలాగైతే పథకం నడపడం కష్టమని పాఠశాలల మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయం వద్ద భోజన పథకం నిర్వాహకులతో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. వంద మంది పిల్లలు దాటిన పాఠశాలల్లో ఐదు లేదా ఆరు కౌంటర్లు ఏర్పాటు చేసి విద్యార్థులకు భోజనాలు పెట్టాలని అధికారులు ఇచ్చిన ఆదేశాలు నిర్వాహకులకు ఇబ్బందికరంగా ఉన్నాయన్నారు. కనీస స్థాయిలో సిబ్బంది లేకుండా ఇదెలా సాధ్యమని ప్రశ్నించారు. ఒక వైపు పాఠశాలల్లో ఉన్న కార్మికులను తొలగించడం లేదా కుదించడం చేస్తూ.. మరోవంక ఐదారు కౌంటర్లు పెట్టాలని ఆదేశాలు ఇవ్వడం, హెచ్ఎంలతో నిర్బంధం పెట్టడం వంటి చర్యలు ఎంతమాత్రం తగవన్నారు. సౌకర్యాలు లేకపోయినా పథకం అమలులో కష్టపడుతున్న నిర్వాహకులను ఏదో విధంగా బయటకు పంపించాలన్నదే ప్రభుత్వ వ్యూహంలా ఉందని ఆరోపించారు. ఇప్పటికైనా ఇటువంటి అర్థరహిత నిర్ణయాలు చేయడం, నిబంధనలు విధించడం మానుకోవాలన్నారు. ఈ సమావేశంలో సంఘం నేతలు బుచ్చిరాజమ్మ, లక్ష్మి, మంగమ్మ, హసీనా తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థి హిందీ నేర్చుకోవాలి

» జిల్లా విద్యా శాఖాధికారి వెంకటలక్ష్మమ్మ



ఉత్తమ హిందీ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ప్రభాకర్‌ను సత్కరిస్తున్న డీఈవో

చీడికాడ, సెప్టెంబరు 13 : ప్రతి విద్యార్థి హిందీ నేర్చుకోవడం అవసరమని జిల్లా విద్యా శాఖాధికారి వెంకటలక్ష్మమ్మ కోరారు. చుక్కపల్లి హైస్కూల్‌ను శుక్రవారం సాయంత్రం డీఈవో సందర్శించారు. హిందీ దివాస్ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ అభ్యసన సామగ్రిని పరిశీలించారు. అనంతరం పాఠశాల హెచ్ఎం బీవీ రమణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ జాతీయ భాష హిందీని క్షుణ్ణంగా నేర్చుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు. ఉత్తమ హిందీ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చీమకుర్తి ప్రభాకర్‌ను ఆమెతో పాటు పలువురు ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. పాఠశాలలో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు డీఈవో చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల అధ్యక్షులు జీపీఏ నాయుడు, తురువోలు హైస్కూల్ హెచ్ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జోలాపుట్టు సరిహద్దు వంతెనకు మరమ్మతు



జోలాపుట్టు సరిహద్దు వంతెన పనులు చేపడుతున్న దృశ్యం

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 13: మండలంలో ఆంధ్రా, ఒడిశా ప్రాంతాలను కలిపే జోలాపుట్టు సరిహద్దు వంతెన మరమ్మత్తు పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఇటీవల వరదనీటి ఉధృతికి వంతెన దెబ్బతినడంతో అటుగా రాకపోకలు స్తంభించిపోయిన విషయం తెలిసిందే. పలువురు నాయకులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన స్పందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు దగ్గరుండి తాత్కాలిక మరమ్మతు పనులను చేయిస్తున్నారు. ఇనుప వంతెనకు ఇరువైపులా మట్టి పోస్తున్నారు. పాదచారులు రాకపోకలు సాగించేలా మరమ్మతులు చేస్తున్నారు. నిధులు మంజూరైన వెంటనే పూర్తి స్థాయిలో పనులు చేపట్టనున్నట్టు తెలిసింది.

సికింద్రాబాద్-శ్రీకాకుళం మధ్య ప్రత్యేక ఏసీ రైలు

విశాఖపట్నం, సెప్టెంబరు 13: పండుగల రద్దీని దృష్టిలో ఉంచుకుని దువ్వాడ మీదుగా సికింద్రాబాద్, శ్రీకాకుళం రోడ్డు మధ్య ప్రత్యేక ఏసీ రైలు సర్వీసులు ప్రవేశపెడుతున్నట్లు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 07487 నంబరు గల ప్రత్యేక ఏసీ రైలు అక్టోబరు 2 నుంచి నవంబరు 6 వరకు ప్రతి బుధవారం రాత్రి 7.40 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.10 గంటలకు దువ్వాడ, మధ్యాహ్నం 12.00 గంటలకు శ్రీకాకుళం రోడ్డు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07488 నంబరు గల ఏసీ ప్రత్యేక రైలు అక్టోబరు 3 నుంచి నవంబరు 7 వరకు గురువారం సాయంత్రం 5.00 గంటలకు శ్రీకాకుళం రోడ్డు స్టేషన్‌లో బయలుదేరి రాత్రి 6.47 గంటలకు దువ్వాడ, మరుసటి రోజు ఉదయం 9.50 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది. ఈ సర్వీసులు 17 థర్డ్ ఏసీ, రెండు మోటారు కార్ కోచ్‌లతో నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, ఎలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

పలు రైళ్ల గమ్యం కుదింపు...రీ షెడ్యూల్

భద్రత నిర్మాణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో విశాఖ-పలాస మధ్య నడిచే 07470, 07471 నంబర్లు గల మెము రైళ్లు ఈ నెల 19, 21 తేదీల్లో విశాఖ-శ్రీకాకుళం రోడ్డు స్టేషన్ల మధ్య రాకపోకలు సాగిస్తాయ డీసీఎం చెప్పారు. ఈ నెల 18న సాయంత్రం 6.50 గంటలకు పాండిచ్చేరిలో బయలుదేరాల్సిన పాండిచ్చేరి-భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్ (1289) రాత్రి 9.35 గంటలకు (రెండు గంటల 45 నిమిషాలు), ఈ నెల 18, 20 తేదీల్లో మధ్యాహ్నం 1.40 గంటలకు కేఎస్ఆర్ బెంగళూరులో బయలుదేరాల్సిన ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ (18464) సాయంత్రం 4.10 గంటలకు (రెండు గంటల 30 నిమిషాలు) ఆలస్యంగా బయలుదేరే విధంగా రీ షెడ్యూల్ చేసినట్లు పేర్కొన్నారు.

27న తపాలా అదాలత్

విశాఖపట్నం, సెప్టెంబరు 13: ఎంవీపీ కాలనీలోని ఆర్ఎంఎస్ కార్యాలయం ఆవరణలో ఉన్న పోస్టుమాస్టర్ జనరల్ కార్యాలయంలో ఈనెల 27న తపాలా అదాలత్ నిర్వహించనున్నట్టు ఆ శాఖ విశాఖపట్నం రీజియన్ అసిస్టెంట్ డైరెక్టర్ సాగర్ తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తపాలా వినియోగదారుల వ్యక్తిగత ఫిర్యాదులు పరిష్కారానికి ఈ అదాలత్‌ను వినియోగించుకోవాలని కోరారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖ, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల పరిధిలోని వినియోగదారులు తమ సమస్యలు, ఫిర్యాదులను ఈ నెల 23వ తేదీలోగా 115వ తపాలా అదాలత్ అన్న శీర్షికతో కేవీడీ సాగర్, అసిస్టెంట్ డైరెక్టర్, పోస్టు మాస్టర్ జనరల్ కార్యాలయం, విశాఖపట్నం 530017 చిరునామాకు పంపించాలని ఆయన సూచించారు.

కల్యాణపులోవకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

» రెండు గేట్లు ఎత్తి వంద క్యూసెక్కుల నీరు విడుదల



సర్పానదిలోకి వెళ్తున్న కల్యాణపులోప నీరు

రావికమతం, సెప్టెంబరు 13: పరివాహక ప్రాంత ఎగువ కొండల్లో కురుస్తున్న వర్షాలతో మండలంలో కల్యాణపులోవ రిజర్వాయర్‌కు వరద ప్రవాహం కొనసాగుతుండంతో ఎత్తిన రెండు గేట్లు మూడో రోజైన శుక్రవారం కూడా కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం వంద క్యూసెక్కుల మేర అదనపు నీటిని విడిచి పెడుతున్నామని జేఈ సత్యనారాయణదొర తెలిపారు. 460 అడుగుల సామర్థ్యం గల ఈ రిజర్వాయర్ పరిధిలో భారీ వర్షాలు లేనప్పటికీ పరివాహక ప్రాంత ఎగువ కొండ గెడ్డల ద్వారా ఇన్‌ఫ్లో ఎఫఫ75 క్యూసెక్కుల మేర రిజర్వాయర్‌లోకి చేరుతోంది. దీంతో జలాశయం నీటి నిల్వలు 459.00 అడుగులకు మించకుండా స్థిరీకరిస్తున్నట్టు జేఈ తెలిపారు.

19 నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

లంకెలపాలెం, సెప్టెంబరు 13: జీవీఎంసీ 84వ వార్డు సాలాపువానిపాలెంలో వినాయక ఉత్సవాలను పురస్కరించుకొని ఈనెల 19 నుంచి రాష్ట్రస్థాయి పురుషులు, మహిళల కబడ్డీ పోటీలు నిర్వహించనున్నామని ఉత్సవ కమిటీ ప్రతినిధి సాలాపు మోహన్‌రావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు విద్యుత్ దీప కాంతుల్లో ఈ పోటీలు జరుగుతాయన్నారు. అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పోటీలను ప్రారంభించనున్నారని వివరించారు. ఇందులో ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు రూ30 వేలు, ద్వితీయ స్థానానికి రూ.20 వేలు, తృతీయ స్థానానికి రూ.15 వేలు, నాలుగో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10 వేలు చొప్పున నగదు బహుమతులతో పాటు మెమొంటోలను అందజేస్తామన్నారు. ఔత్సాహికులు 99495 10771 నంబరులో సంప్రదించాల్సింగా ఆయన కోరారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం : తల్లీబిడ్డ క్షేమం

నర్సీపట్నం, సెప్టెంబరు 13: పురుడు పోసుకోవడానికి 108 అంబులెన్స్‌లో ఏరియా ఆస్పత్రి తరలిస్తున్న గర్భిణికి మార్గంమధ్యలో సుఖ ప్రసవం జరిగింది ఆడ శిశువు జన్మించింది. గొలుగొండ మండలం కొత్త ఎల్లవరం గ్రామానికి చెందిన కూండ్రపు హారికకు శుక్రవారం ఉదయం పురుటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కి ఫోన్ చేశారు. మాకవరపాలెం 108లో నర్సీపట్నం ప్రాంతీయ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో హారికకు నొప్పులు అధికంగా రావడంతో ఈఎంటీ రేవంత్, పైలెట్ శ్రీనివాసరావు పురుడు పోశారు. ప్రస్తుతం ఆడ శిశువు, తల్లి క్షేమంగా ఉన్నారు.

108 వాహనంలో పుట్టిన ఆడబిడ్డతో సిబ్బంది



బ్యాంకులో నగదు జమ చేయకపోవడం నేరం

» డీసీసీబీ సీఈవో డీవీఎస్ వర్మ



విచారణ చేస్తున్న డీసీసీబీ సీఈవో వర్మ

రోలుగుంట, సెప్టెంబరు 13: రైతుల నుంచి వసూలు చేసిన వ్యవసాయ రుణాల బకాయిల నగదు బ్యాంకులో జమ చేయకుండా సిబ్బంది జీతాలకు వాడుకోవడం చట్ట విరుద్ధమని డీసీసీబీ సీఈవో డీవీఎస్ వర్మ అన్నారు. దీనిపై రైతుల నుంచి ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఆయన శుక్రవారం రోలుగుంట, జానకిరామపురం పీఏసీఎస్‌లను సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ జానకిరామపురం, రోలుగుంట పీఏసీఎస్‌లలో రైతులు చెల్లించిన వ్యవసాయ రుణాల నగదును సిబ్బంది బ్యాంకులో జమ చేయకుండా జీతాలకు వాడుకుంటున్నారని తెలిపారు. ఈ విధంగా రోలుగుంట పీఏసీఎస్‌లో సుమారు రూ.7 లక్షలు రైతులు చెల్లించిన డబ్బులు జమ చేయలేదని తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ చేపడుతున్నట్టు చెప్పారు. ఈ విచారణలో ఆడిటర్ శ్రీనివాసరావు, మేనేజర్ నాయుడు పాల్గొన్నారు.

ఏపీ బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడికి సత్కారం



కృష్ణ దంపతులను సత్కరిస్తున్న న్యాయవాదులు

చోడవరం, సెప్టెంబరు 13: ఏపీ బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు కృష్ణమోహన్ దంపతులను స్థానిక బార్ అసోసియేషన్ న్యాయవాదులు శుక్రవారం సత్కరించారు. శుక్రవారం పట్టణంలోని స్వయంభూ విఘ్నేశ్వరుడిని దర్శించుకోవడానికి వచ్చిన ఆయనను బార్ అసోసియేషన్ న్యాయవాదులు, ఏజీపీలు సాదరంగా స్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏజీపీ వేసలపు వెంకటరావు, న్యాయవాదులు పప్పల రమణమూర్తి, చీపురుపల్లి సూర్యానారాయణ, అల్లు గిరిధర్, వెంకటరావు, పాత్రుడినాయుడు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



అడ్డరోడ్డులో ఉత్తమ గురువులను సన్మానిస్తున్న ఏపీటీఎఫ్ బృందం

ఎస్.రాయవరం, సెప్టెంబరు 13 : ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన మండలంలోని పలు పాఠశాలలకు చెందిన కేకేఎల్ఎస్ ధర్మారావు, ఆళ్ల సుధాకర్, కె.సంపత్‌రావు, భాస్కర శారద, కె.వీరినాయుడు, ఎస్.ప్రేమ్‌కుమార్, ఎం.భానుశ్రీలను శుక్రవారం మండలంలోని అడ్డరోడ్డులో ఏపీటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, డిప్యూటీ డీఈవో పెన్నాడ అప్పారావులు ముఖ్య అతిథులుగా హాజరై వీరిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి.వెంకటపతిరాజు, ఇన్‌చార్జి ఎంఈవో-2 బి.సత్తిబాబు, ఏపీటీఎఫ్ మండల ప్రతినిధులు జి.సునీల్, కె.శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షుడు వై.శ్రీనివాసరావు, కౌన్సిలర్ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో చంద్రబాబు అద్భుత సేవలు

- ఇవి చూసి ఓర్వలేకే వైసీపీ నాయకులు తప్పుడు విమర్శలు
- జగన్‌వి శవ రాజకీయాలు : టీడీపీ నాయకుడు ప్రగడ



ప్రగడ నాగేశ్వరరావు

అచ్యుతాపురం, సెప్టెంబరు 3 : విజయవాడ విలయం ప్రభుత్వ వైఫల్యమేనని ఎలమంచిలి మాజీ ఎమ్మెల్యే కన్నబాబు రాజు అనడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందని టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఇల్లు మునిగి పోకుండా ఉండటానికే విజయవాడను ముంచేశారని అనడం విడ్డూరంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రేయింబవళ్లు కష్టపడి విజయవాడ ముంపు ప్రాంతాల్లో పునరావాస చర్యలు చేపట్టారన్నారు. ఆ వయసులో చంద్రబాబు చేస్తున్న కృషిపై ప్రపంచమంతా ప్రశంసల జల్లు కురిపిస్తుంటే, వైసీపీ నాయకులు ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. బోట్లు ద్వారా ప్రకాశం బ్యారేజీని ముక్కలు చేసి శవరాజకీయం చేయాలని జగన్ రెడ్డి చేసిన ప్లాన్ ప్రజలకు తెలుసునని పేర్కొన్నారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన కన్నబాబురాజు విజయవాడ బాధితులకు ఏమైనా విరాళం ఇచ్చారా..? అని ప్రగడ ప్రశ్నించారు. కేవలం జగన్ మెప్పు కోసమే ఇటువంటి తప్పుడు ప్రకటనలు మానుకోవాలని ఆయన హితవులు పలికారు.

యూనియన్ బ్యాంక్ ఉద్యోగులు నిరసన



నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న బ్యాంకు ఉద్యోగులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 13 : కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా శుక్రవారం తుమ్మపాల యూనియన్ బ్యాంక్ వద్ద ఉద్యోగులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. యూనియన్ బ్యాంక్‌తో ఆఫీసర్స్ అసోసియేషన్, మన అవార్డు స్టాఫ్ యూనియన్లు కలిసి 20 అంశాలపై జరిగిన చర్చలు విఫలం కావడంతో ఈ రెండు యూనియన్లు కలిసి సెప్టెంబరు 27వ తేదీన సమ్మె చేయడంతో పాటు రోజువారీ నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చినట్టు యూనియన్ జాయింట్ సెక్రటరీ కాండ్రేగుల హరికృష్ణ తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో శ్రీదేవి, శిరీషా, రోజాశ్రీ, రాము, మాలతి, రమేష్ నానాజీ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు డక్కన్ కెమికల్స్ భారీ సాయం



చంద్రబాబుకు చెక్కు అందిస్తున్న సంస్థ ప్రతినిధులు, చిత్రంలో మంత్రి అనిత

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 13 : విజయవాడ వరద బాధితుల సహాయార్థం మండలంలో ఉన్న డక్కన్ ఫైన్ కెమికల్స్ యాజమాన్యం రూ.60 లక్షల ఆర్థిక సాయాన్ని అందించింది. ఈ మేరకు శుక్రవారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు హోం మంత్రి వంగలపూడి అనిత సమక్షంలో సంస్థ డైరెక్టర్ కేవీఎల్‌పీ రాజు, ఉపాధ్యక్షులు ఏఎస్ వీరారెడ్డి రూ.50 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కేవీఎల్‌పీ రాజు మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా కలెక్టర్ సహాయ నిధికి ఇప్పటికే రూ.10లక్షలు అందజేసినట్టు చెప్పారు. సాయం అందించిన యాజమాన్యాన్ని సీఎం అభినందించారు.

'ఎసెన్షియా' బాధిత కుటుంబానికి బాసట

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 13 : అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీలో ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడిన కశింకోట మండలం తీడ గ్రామానికి చెందిన గంగాధర్‌కు వైసీపీ లక్ష రూపాయలను అందజేసింది. శుక్రవారం ఇక్కడి పార్టీ కార్యాలయంలో సదరు చెక్కును నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ తదితరులు అందజేశారు.

శభాష్ పోలీస్

... 5వ పేజీ తరువాయి

కారణమైన వాహనం గొలుగొండ మండలం గుండపాలలో వున్నట్టు గురువారం సాయంత్రానికి గుర్తించారు. పోలీసులు అక్కడకు వెళ్లి సరుగుడు తోటల్లో వుంచిన టాటా ఏస్ వాహనాన్ని స్వాధీనం చేసుకుని, డ్రైవర్ మర్రా రెడ్డిమయ్యను అదుపులోకి తీసుకున్నారు. కోమళ్లపూడి వద్ద బాలికను ఢీకొట్టిన తరువాత డ్రైవర్ నర్సీపట్నం వెళ్లకుండా, మధ్యలో రావికమతం మండలం చినపాచిల, మాడుగుల మండలం వమ్మలి, ఘాటీరోడ్డు మీదుగా పాడేరు వెళ్లాడని, అక్కడి నుంచి చింతపల్లి మండలం లోతుగెడ్డ మీదుగా సొంతూరు గొలుగొండ మండలం గుండుపాల చేరుకుని, వాహనాన్ని సరుగుడు తోటలో దాచిపెట్టాడని సీఐ కోటేశ్వరరావు వివరించారు. అయా మార్గాల్లో పలుచోట్ల వున్న సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా ప్రమాదం జరిగిన 24 గంటల్లోనే వాహనంతోసహా నిందితుడిని పట్టుకున్నామని చెప్పారు. ఈ కేసును 24 గంటల్లో ఛేదించినందుకు తనతో పాటు ఎస్ఐలు, పోలీసు సిబ్బందిని ఎస్పీ దీపిక అభినందించారని ఆయన తెలిపారు.

తహసీల్దార్ల బదిలీలపై తర్జనభర్జన

... 5వ పేజీ తరువాయి

శివారు ప్రాంతంలో పనిచేసి ప్రస్తుతం నగరంలో పనిచేస్తున్న మరో తహసీల్దారు అనకాపల్లికి వెళ్లడానికి నిర్ణయించారు. అనకాపల్లి జిల్లా నుంచి ఇద్దరు మహిళా తహసీల్దార్లు నగరానికి రావడానికి అక్కడ అధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని తెలిసింది. కాగా విశాఖ జిల్లాలో పనిచేస్తున్న కొందరు తహసీల్దార్లపై ఉన్నతాధికారులు అసంతృప్తితో ఉన్నందున కనీసం ఇద్దరు లేదా ముగ్గురిని అనకాపల్లికి పంపాలని లేదా అప్రాధాన్య పోస్టుల్లో నియమించాలని భావిస్తున్నారు. మరో తహసీల్దార్ అయితే ప్రస్తుతం పనిచేస్తున్న మండలం నుంచి తప్పించాలని కోరుతున్నారు. కలెక్టరేట్‌లో పనిచేయడానికి సిద్ధపడినట్టు చెబుతున్నారు. మరో తహసీల్దారు విషయంలో కూటమికి చెందిన కీలక నేత ఒకరు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, సదరు అధికారిని ఏజెన్సీకి పంపాలని ఉన్నతాధికారులకు స్పష్టంచేశారని జోరుగా ప్రచారం జరుగుతుంది. కాగా బదిలీలకు ఈనెల 22 వరకు గడువు పొడిగించడంతో వచ్చే వారం ఉమ్మడి జిల్లా పరిధిలో ముగ్గురు కలెక్టర్లు భేటీ కానున్నారని, ఈ భేటీలో తహసీల్దార్ల బదిలీలపై ఒక నిర్ణయం తీసుకుంటారని తెలిసింది.

చిన్న గ్రామానికి పెద్ద కష్టం

- 'రైల్వే' నిర్వాకంతో చినబోదిగల్లంకు ఏడాదిగా నీటి సమస్య
- పెదబోదిగల్లం లెవెల్ క్రాసింగ్ గేటు వద్ద అండర్ గ్రౌండ్ వంతెన నిర్మాణం
- ఆ సమయంలో పైపులైన్లు దెబ్బతింటాయని గ్రామస్థులు అభ్యంతరం
- పనులు పూర్తయిన వెంటనే తిరిగి వేస్తామని చెప్పి నిర్లక్ష్యం





ఏడాది కిందట నిర్మించిన వంతెన..., పెదబోదిగల్లంలో నీరు పట్టుకుంటున్న చినబోదిగల్లం గ్రామస్థులు

నక్కపల్లి, సెప్టెంబరు 13 : మండలంలోని పెదబోదిగల్లం శివారు చినబోదిగల్లంలో తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. ఏడాది నుంచి పైపులైన్ల ద్వారా నీరు నిలిచిపోవడం గ్రామ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెదబోదిగల్లంలెవెల్ క్రాసింగ్ రైల్వే గేటు వద్ద ఏడాది కిందట అండర్ గ్రౌండ్ వంతెన నిర్మించారు. ఇందులో భాగంగా ఎస్.రాయవరం మండలం దార్లపూడి నుంచి పైపులైన్ల ద్వారా పెదబోదిగల్లం మీదుగా చినబోదిగల్లం గ్రామానికి మంచినీరు సరఫరా అయ్యేది. వంతెన నిర్మాణ సమయంలో పైపులైన్లు తొలగించేందుకు అభ్యంతరం చెబితే.., పనులు పూర్తయిన వెంటనే పైపులైన్లు ఏర్పాటు చేస్తామని అప్పటి రైల్వేశాఖ అధికారులు తెలిపారని గ్రామస్థులు పేర్కొన్నారు. కానీ వంతెన పూర్తయి ఏడాదైనా ఇప్పటి వరకూ పైపులైన్లను పునరుద్ధరించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు వారు తెలిపారు. గత్యంతరం కిలోమీటరు దూరంలో ఉన్న పెదబోదిగల్లం గ్రామానికి వెళ్లి ఈ గ్రామస్థులు కుళాయిలు, బావుల నుంచి నీటిని తెచ్చుకోవల్సివస్తోంది. వర్షాలు కురిసినప్పుడు కొత్తగా నిర్మించిన వంతెన వద్ద మోకాళ్లలోతు నీరు నిలిచిపోతోందని, ఈ కారణంగా నీరు తెచ్చుకోలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన చెందుతున్నారు. ఉన్నతాధికారులు సమస్యను పరిష్కరించాలని అంతా వేడుకుంటున్నారు.

నిజంగా చాలా ఇబ్బంది పడుతున్నారు



చినబోదిగల్లం, అప్పలపాయకరావుపేట గ్రామాలకు మంచినీటిని సరఫరా చేసే పైపులైన్లు రైల్వే వంతెన నిర్మాణ సమయంలో తొలగించారు. వంతెన పూర్తయినా వాటిని పునరుద్ధరించ లేదు. అలాగని తాము పనులు చేపట్టి పైపులైన్ యథావిధిగా వేసుకుంటామని చెప్పినా రైల్వే అధికారులు అంగీకరించడం లేదు. దీంతో చినబోదిగల్లం గ్రామస్థులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నక్కపల్లి శివారు అప్పలపాయకరావుపేట ప్రజలకు కూడా మంచినీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ముస్సీషా బేగం, సర్పంచ్, పెదబోదిగల్లం

42 మంది ఎన్‌సీసీ కేడెట్లు రక్తదానం



కళాశాల ఆవరణలో రక్తదానం చేస్తున్న ఎన్‌సీసీ కేడెట్‌లు

అచ్యుతాపురం, సెప్టెంబరు 13 : ఇక్కడి ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 42 మంది ఎన్‌సీసీ కేడెట్లు రక్తదానం చేశారు. ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఈ శిబిరం ఏర్పాటైంది. 2 (ఎ) సీటీఆర్, ఎన్‌సీసీ విశాఖపట్నం అధికారిణి లెఫ్టినెంట్ కల్నల్ పల్లవి వర్మ, ప్రశాంతి విద్యా సంస్థల చైర్మన్ ధర్మిరెడ్డి ప్రసాద్ ఎన్‌సీసీ కేడెట్లను అభినందించారు.

'విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి'



విశ్వేశ్వరయ్య విగ్రహం వద్ద అబ్రహం, రత్నాకర్ నివాళి

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 13 : ఇక్కడి దైట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీర్స్ డే శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ పూర్తి చేయడమే కాకుండా నైపుణ్యాలు, పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడం ద్వారా ఉద్యోగావకాశాలను మెరుగుపర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. దాడి విద్యా సంస్థల చైర్మన్ రత్నాకర్ మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య నిస్వార్థంగా దేశానికి చేసిన సేవలను వివరించారు. ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు, ఇంజనీరింగ్ విభాగాధిపతి భార్గవి, వై.హేమంత్‌కుమార్, కృష్ణనాగ్, గంగాధర గుప్తా తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌కు అవార్డు



వైస్ ప్రిన్సిపాల్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

ఎలమంచిలి, సెప్టెంబరు 13 : పట్టణంలోని గుర జాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రేఖ రామారావుకు నాలెడ్జ్ డా.బి.ఆర్.అంబేడ్కర్ గ్లోబల్ డైమండ్ ఎచీవర్స్ అవార్డు లభించింది. సమాజ సేవ, ఉత్తమ విద్యాబోధన అందిస్తున్నందుకు రామారావును గురునానక్ దేవ్ యూనివర్సిటీ (అమృత్ సర్), గోపాల్ కిరణ్ సేవా సంస్థ సంయుక్తంగా ఎంపిక చేసి, ఈ అవార్డును ఇటీవల అందజేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ప్రిన్సి పాల్ డాక్టర్ చంద్రశేఖర్, అధ్యాపక సిబ్బంది అతనిని అభినందించారు.

తొమ్మిది ఇసుక టైరు బండ్లు పట్టివేత

కోటవురట్ల, సెప్టెంబరు 13 : మండలంలోని రాజుపేటలో గల సర్పా నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు జరుపుతున్నారని తెలుసుకున్న రెవెన్యూ అధికారులు శుక్రవారం దాడి చేశారు. నది నుంచి ఇసుక తరలించి నిల్వ చేస్తున్న తొమ్మిది టైరు బండ్లను ఆర్ఐ, వీఆర్వో పట్టుకున్నారు. అనంతరం వీటిని తహసీల్దార్ కార్యాలయానికి తరలించగా, తహసీల్దార్ జానకమ్మ సదరు యజమానులకు జరిమానా విధించారని వీఆర్వో రమేష్ తెలిపారు.

'జనవాణి'కి వినతుల వెల్లువ



వినతి పత్రం స్వీకరిస్తున్న శివదత్ తదితరులు

నక్కపల్లి, సెప్టెంబరు 13 : ఇక్కడి జనసేన కార్యాలయంలో నిర్వహిస్తున్న జనవాణి కార్యక్రమానికి వినతులు వెల్లువెత్తుతున్నాయి. పలు గ్రామాలకు చెందినవారు తమ సమస్యలను విన్నవిస్తున్నారు. వారం రోజుల్లో దాదాపు యాభైకి పైగా ఫిర్యాదులు అందాయని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్ తెలిపారు. శుక్రవారం పలువురు రైతులు తమ సమస్యలతో పాటు, కారిడార్ భూముల్లో నష్ట పరిహారంలో తమకు మోసం జరిగిందంటూ శివదత్‌కు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు కురందాసు అప్పలరాజు, పాము గణేశ్, పిక్కి స్వామి, రాజా, బంగారి రాజు, సుంకరసాయి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలు పూడ్చివేత



వరద నీటిని మోటారుతో తోడుతున్న దృశ్యం

సబ్బవరం, సెప్టెంబరు 13 : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పినగాడి- కె.కోటపాడు రోడ్డులో పలు చోట్ల రోడ్డు ధ్వంసమైంది. దీంతో తరచూ చిన్నచిన్న ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇది గుర్తించిన వైసీపీ నాయకుడు గండి రవికుమార్ తన సొంత నిధులతో శుక్రవారం ఆయా గోతులను పూడ్చించారు. ఈ కార్యక్రమంలో మండల యుజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, కర్రి దనుంజయ్, గురి ఫణీంద్ర, సంపత్, వంశీ, రవికుమార్ యువ సైన్యం పాల్గొన్నారు.

'ప్రజారోగ్యంపై వైద్య సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గోవింద్

ఎలమంచిలి, సెప్టెంబరు 13 : ప్రజారోగ్యంపై వైద్య సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని రేగుపాలెం పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ బోదెపు గోవింద్ సూచించారు. శుక్రవారం ఏర్పాటైన కమిటీ సమావేశంలో మాట్లాడారు. వర్షాలు కురుస్తున్నందున అంటు వ్యాధులు ప్రబలకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం వార్డుల్లో పర్యటించి వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో అప్పలనాయుడు, ఆస్పత్రి వైద్యాధికారిణి డాక్టర్ శిరీష, నాయకులుకొల్లి త్రినాథ్, ఎడ్ల వాసు, మర్రి రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రలపై..

నక్కపల్లి : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలందరికీ ఈ నెల 17న నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో డి.సీతారామరాజు సూచించారు. శుక్రవారం ఇక్కడ పంచాయతీ కార్యదర్శులు, వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బందితో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. అనంతరం ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి, ఏఎన్ఎంలకు మాత్రలను అందజేశారు. ఈ సమావేశంలో గొడిచెర్ల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రావణి సంధ్య, ఈవోపీఆర్డీ బి.సత్యనారాయణ, ఎంపీహెచ్ఈవో శ్రీనివాసమూర్తి, హెచ్ఈవో లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : నులి పురుగుల నివారణ మందు పంపిణీపై ఇక్కడి ఎంపీడీవో కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. సర్వసిద్ధి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ వాసంతి ఆధ్వర్యంలో నులి పురుగుల మందు పంపిణీపై హెల్త్ సూపర్‌వైజర్, ఉపాధ్యాయులు, ఎంఎల్‌హెచ్‌పీ, హెల్త్ సెక్రటరీలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఆయన ఆదేశించారు.



నక్కపల్లిలో మాత్రలు అందిస్తున్న ఎంపీడీవో



ఎస్.రాయవరంలో...

సీతారాం ఏచూరికి వామపక్ష నాయకులు నివాళి



అనకాపల్లిలో ఏచూరి చిత్రపటం వద్ద నివాళి

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 13 : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి వామపక్షాల నాయకులు శుక్రవారం సంతాపం తెలిపారు. ఇందులో భాగంగా సీపీఐ కార్యాలయంలో ఏచూరి చిత్రపటానికి సీపీఐ జోనల్ కార్యదర్శి వైఎన్ భద్రం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన పోరాట పటిమను వివరించారు. నాయకులు ఎం.సూరిబాబు, ఎం.చిన్ని, డి.సూర్యారావు, కె.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : కమ్యూనిస్టు నాయకుడు సీతారాం ఏచూరి మరణం తీరని లోటని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ అన్నారు. పరవాడలో ఏర్పాటు చేసిన సంతాప సభలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్మిక పీడిత వర్గాల అభ్యున్నతికి ఏచూరి చేసిన కృషి శ్లాఘనీయమన్నారు. యూనియన్ నాయకులు ఎస్.సంతోష్, రవి, ఎస్.కృష్ణఅప్పారావు, సీహెచ్.గణేష్, కె.అప్పారావు, పి.అప్పలరాజు పాల్గొన్నారు.

సబ్బవరం : సీతారాం ఏచూరికి సీపీఎం మండల నాయకులు ఇక్కడ నివాళులర్పించారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు బి.ప్రభావతి, సీపీఎం మండల నాయకురాలు ఉప్పాడ సత్యవతి, గౌరీసు తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు.

ఎలమంచిలి : ఇక్కడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీతారాం ఏచూరికి విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి ఎస్ఎఫ్ఐ ప్రతినిధి కారే మణికంఠ, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.శివాజీ, ప్రతినిధులు రవి, గణేష్, కృప తదితరులు పూలమాల వేసి అంజలి ఘటించారు.

అచ్యుతాపురం : సీతారాం ఏచూరికి సీపీఎం శ్రేణులు శుక్రవారం ఇక్కడ నివాళులర్పించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసిన అనంతరం ఆయన సేవలను కీర్తించారు. నాయకులు రామ సదాశివరావు, కర్రి అప్పారావు, కె. సోమునాయుడు, ఆర్.లక్ష్మీరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పరవాడలో...

రాంబిల్లి : సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం ఉద్యమానికి తీరని లోటని ఆ పార్టీ మండల కన్వీనర్ జి.దేముడునాయుడు అన్నారు. శుక్రవారం ఇక్కడ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏచూరి సేవలను కీర్తించారు. నాయకులు నారాయణరావు, రామకృష్ణ, నూకన్న, రాము, శివాజీ, ప్రజా సంఘాల నాయకులు భాస్కరరావు, మాజీ సర్పంచ్ వై.శ్రీనివాసరావు,రాము, గంగరాజు, కాశియ్య పాల్గొన్నారు.

పూడిమడకలో సామూహిక లక్ష్మీగణపతి పూజ



పూజల్లో పాల్గొన్న భక్తులు

అచ్యుతాపురం, సెప్టెంబరు 13 : పూడిమడక పాత బస్టాండ్ వద్ద గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన మండపంలో శుక్రవారం కుంకుమ పూజను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కొండపాలెం, పూడిమడకకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉమ్మిడి అప్పారావు, జగన్‌తో పాటు సిద్ధి వినాయక యూత్ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పైడితల్లమ్మ మండల దీక్షపై ప్రచారం



ప్రచార రథంలో పైడితల్లమ్మ అమ్మవారు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 13 : విజయనగరం పైడితల్లమ్మ జాతర ప్రచార రథం శుక్రవారం అనకాపల్లి పట్టణానికి చేరింది. పైడిమాంబ దీక్షా పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు ఆర్.సూర్యపాత్రో ఆధ్వర్యంలో ఈ ప్రచార రథం పలు ప్రాంతాల గుండా ముందుకు సాగింది. ఈ నెల 20వ తేదీన విజయనగరం అమ్మవారి చదురు గుడి వద్ద మండల దీక్షా కార్యక్రమం ప్రారంభం కానుందని వివరించారు. అదే రోజు పందిరిరాట, వనం గుడి వద్ద పందిరి రాట వేస్తారన్నారు. అక్టోబరు 14న తొలేళ్ల ఉత్సవం, 15న సిరిమానోత్సవం జరుగుతుందని వివరించారు. ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాల్సిందిగా కోరారు.

రూరల్ ఎస్ఐగా ఉపేంద్ర బాధ్యతల స్వీకరణ



సింహాచలం నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న ఉపేంద్ర

ఎలమంచిలి, సెప్టెంబరు 13 : ఇక్కడి రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా ఉపేంద్ర శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట స్టేషన్ నుంచి బదిలీపై ఆయన ఇక్కడికి విచ్చేశారు. ఇంతవరకు ఈ స్థానంలో ఉన్న సింహాచలం సబ్బవరం బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా కొత్త ఎస్ఐకి సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణపై విద్యారులకు పోటీలు



పర్యావరణంపై విద్యార్థులకు వివరిస్తున్న హెచ్ఎం

నక్కపల్లి, సెప్టెంబరు 13 : చినదొడ్డిగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో రవీంద్రనాథ్ ఠాగూర్ ఇంగ్లీష్ క్లబ్ వ్యవస్థాపకుడు వై.వెంకట రమణ ఆధ్వర్యంలో పరిశుభ్రత- పర్యావరణ పరిరక్షణ అంశంపై విద్యార్థులకు శుక్రవారం వక్తృత్వం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. తొలుత అపరిశుభ్రత వల్ల ఎదురయ్యే అనారోగ్య సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, వెంకటేశ్వర్లుతో పాటు పెద్ద సంఖ్యల విద్యార్థులు పాల్గొన్నారు.

గొడిచెర్ల హైస్కూల్‌లో హిందీ దివాస్

నక్కపల్లి, సెప్టెంబరు 13 : గొడిచెర్ల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం హిందీ దివాస్‌ను నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు జి.అప్పారావు ఈ కార్యక్రమం ఉద్దేశాన్ని విద్యార్థులకు వివరించారు. హిందీ టీచర్లు రమణి కుమారి, శ్రీనివాస్ పలు పోటీలు నిర్వహించారు.

వరద బాధితులకు టీడీపీ నేతలు సహాయం



56వ డివిజన్‌లోచీర పంపిణీ చేస్తున్న నాయకులు


పాయకరావుపేట, సెప్టెంబరు 13 : విజయవాడ వరద బాధితులకు పాయకరావుపేట టీడీపీ నాయకులు తమ వంతు సాయం అందజేశారు. శుక్రవారం పార్టీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు గొర్లె రాజబాబు, నాయకులు మజ్జూరి నారాయణరావు తదితరులు విజయవాడలోని 56వ డివిజన్ పరిధిలో రాజరాజేశ్వరిపేట, మహంకాళి రోడ్డు, డీవీఆర్ ర్యాంప్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి సుమారు 1500 మంది వరద బాధితులకు చీరలు దుప్పట్లు, టవళ్లు పంపిణీ చేశారు. నాయకులు కలిగట్ల శ్రీనివాస్, దేవవరపు ఆనంద్, గొల్లపల్లి నాగు, తలారి రాజా, పడాల కోటి, భజంత్రీల శివ, దాసరి రాజేష్, నారపురెడ్డి నానాజీ పాల్గొన్నారు.

80వ వార్డు వైసీపీ ఇన్‌చార్జిగా నాయుడు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 13 : జీవీఎంసీ 80వ వార్డు వైసీపీ ఇన్‌చార్జిగా సత్యనారాయణమూర్తి దేవస్థానం మాజీ చైర్మన్ కె.ఎం.నాయుడు నియమితులయ్యారు. ఇక్కడి రింగు రోడ్డులోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌లు కేఎం నాయుడుకు నియామక పత్రం అందజేసి అభినందించారు.

తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

▸ మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి



సీమంతం వేడుకలో పాల్గొని గర్భిణులకు ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే బండారు

కె.కోటపాడు, సెప్టెంబరు 13 : తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, తల్లీబిడ్డ సంక్షేమమే శిశు సంక్షేమశాఖ లక్ష్యమని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. శుక్రవారం చౌడువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో చౌడువాడ సర్పంచ్ దాడి ఎరుకునాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన పోషకాహార మాసోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భంలో శిశువు ఊపిరి పోసుకుంది మొదలు జన్మించే వరకు గర్భిణికి తగినంత పోషకాహారం తీసుకోవాలన్నారు. అంతకుముందు నిర్వహించిన సీమంతాల వేడకలో ఎమ్మెల్యే పాల్గొని ఆశీర్వదించారు. చిన్నారులకు అన్నప్రాశన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టిక పిండి వంటలను పరిశీలించి వాటి రుచి చూశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి వి.మంగతాయారు, సూపర్‌వైజర్ సుశీల, చౌడువాడ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బోకం సన్నిబాబు, నాయకులు దోకల నరసింహమూర్తి, జూరెడ్డి రాము, పూడి నారాయణమూర్తి, లెక్కల మల్లేశ్వరరావు, కుంచా అంజిబాబు, బోళెం బుల్లిదొర, పూడి శ్రీను, బోజంకి సూర్యనారాయణ, అంగన్‌వాడీ సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ యాప్ టాప్ పెర్ఫార్మెన్సర్లకు ఎమ్మెల్యే అభినందన



టాప్ పెర్ఫార్మెన్సర్లకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజు

రోలుగుంట, సెప్టెంబరు 13 : చోడవరం నియోజకవర్గంలో మన టీడీపీ యాప్ ద్వారా ప్రజలకు సమాచారం చేరవేయడంలో టాప్ పెర్ఫార్మెన్స్‌గా నిలిచిన మండలంలోని కొవ్వూరు గ్రామానికి చెందిన బంటు రాజు, తులసీ, రోహిణీశ్వర్, లోకేశ్వరిలను ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు అభినందించారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం వీరికి టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ స్వయంగా సంతకం చేసిన ప్రశంసాపత్రాలను అందించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గుములూరు చంద్రమౌళి, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు పంచాడ చంద్ర, క్లస్టర్ ఇన్‌చార్జి కోలిపల్లి ఈశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఏచూరి మృతి తీరని లోటు

▸ వామపక్ష నేతల నివాళి



రావికమతంలో నివాళి అర్పిస్తున్న వామపక్ష నేతలు

రావికమతం, సెప్టెంబరు 13 : కమ్యూనిటీ సీనియర్ నేత, మేధావి సీతారాం ఏచూరి మృతి దేశ రాజకీయాలకు తీరని లోటు అని సీపీఎంజిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు, సీపీఐ మండల కార్యదర్శి జి.జోగిరాజు అన్నారు. కొత్తకోటలో శుక్రవారం సీతారాంఏచూరికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు పి.రమణాజీ, గిరిజన సంఘం నాయకులు పాడి బన్నయ్య, రాజునాయుడు పాల్గొన్నారు.

చోడవరం : సీపీఎం నేత ఏచూరి మృతికి స్థానిక ఉషోదయ కళాశాలల చైర్మన్ జెర్రిపోతుల రమణాజీ శుక్రవారం నివాళులు అర్పించారు. కళాశాలలో సంతాపసభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

చీడికాడ : సీపీఎం కేంద్ర ప్రధాన కార్యదర్శి కామిరెడ్డి సీతారాం ఏచూరి మృతి ఆ పార్టీకి తీరని లోటని ఆ పార్టీ మండల కార్యదర్శి రొంగలి దేముడు నాయుడు అన్నారు. కోనాం పంచాయతీ గుంటు కొత్తూరులో ఏచూరి చిత్రపటానికి శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకుడు గంటా శ్రీరామ్, శ్రీనివాసరావు, గంటా చిన్నాలు, సింహాచలంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు

▸ సీఐ అప్పలరాజు



చోడవరం, సెప్టెంబరు 13 : వాహనాలు నడిపే మైనర్లతో పాటు, వారి తల్లిదండ్రులపైనా కఠిన చర్యలు తప్పవని స్థానిక సీఐ బి.అప్పలరాజు హెచ్చరించారు. పట్టణం సీఐగా విధుల్లో చేరిన ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులు ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోవాలన్నారు. జరిమానాలు గతంలో కంటే భారీగా పెరిగాయని, వాహనదారులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు కూడా అదే స్థాయిలో ఉంటాయన్నారు. పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరించనున్నామన్నారు. అలాగే పట్టణ పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నామని, కీలకమైన ప్రదేశాల్లో సీసీ కెమెరాల కోసం స్థానిక వ్యాపారుల సహకారం కూడా తీసుకుంటామని ఆయన తెలిపారు. వినాయక చవితి ఉత్సవాల్లో అశ్లీలతకు తావు లేకుండా నిమజ్జనాలు నిర్వహించాలని నిర్వాహకులకు సీఐ అప్పలరాజు సూచించారు.

వడ్డాదిలో విరిసిన హరివిల్లు



వడ్డాదిలో కనిపించిన ఇంద్రధనస్సు

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 13 : భువికి హరివిల్లు దిగొచ్చినట్లు కనిపిస్తున్న ఆహ్లాదకర దృశ్యం శుక్రవారం వడ్డాదిలో కనిపించింది. ఆకాశంలో వెల్లివిరిసిన సప్తవర్ణాల ఇంద్రధనస్సు చూపరులను ఆకట్టుకుంది. పలువురు తమ మొబైల్స్‌లో ఈ సుందర దృశ్యాన్ని బంధించారు. ఈ సమయంలో తేలికపాటి జల్లులతో కూడిన వర్షం కురిసింది.

పైపులైన్ లీకేజీతో తాగునీరు వృథా



రోడ్డుపై పారుతున్న తాగునీరు

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 13 : కృష్ణాదేవిపేట-నర్సీపట్నం మార్గం మధ్యలో కొండగోకిరి వద్ద పైపులైన్ లీకేజీ ఏర్పడడంతో ప్రధాన రహదారిపై తాగునీరు వృథాగా పోతోంది. గొలుగొండ మండలం లింగంపేట బొడ్డేరు గెడ్డలో రూ.11 కోట్లతో నిర్మించిన భారీ మంచినీటి ప్రాజెక్టు ద్వారా సుమారు 20 గ్రామాలకు మంచినీరు సరఫరా అవుతుంది. అయితే గురువారం ఉదయం కొండగోకిరి వద్ద బీఎస్ఎన్ టవర్ పక్కన విద్యుత్ స్తంభం ఏర్పాటుకు డ్రిల్లింగ్ చేస్తుండగా ఈ పైపులైన్‌కు రంధ్రం పడింది. దీంతో రోడ్డుపై వందల లీటర్ల తాగు నీరు పారుతోంది. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రక్తదానంతో ప్రాణదానం

▸ స్పీకర్ అయ్యన్నపాత్రుడు



రక్తదానం పోస్టర్ ఆవిష్కరిస్తున్న స్పీకర్ అయ్యన్న

నర్సీపట్నం, సెప్టెంబరు 13 : రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతీ ఒక్కరు రక్తం దానం చేయడానికి ముందుకు రావాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు. అమ్మ హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గాంధీ జయంతి సందర్భంగా అక్టోబరు 2న వడ్డాదిలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను స్పీకర్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా టీడీపీ అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

24, 25 తేదీల్లో క్రీడా పోటీలకు సన్నాహాలు



సమావేశమైన ఫిజికల్ డైరెక్టర్లు

నర్సీపట్నం, సెప్టెంబరు 13 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ చదువుతున్న విద్యార్థులకు నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు నర్సీపట్నంలో నిర్వహించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. శుక్రవారం నియోజకవర్గం పరిధిలోని వ్యాయామ ఉపాధ్యాయులు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల (మెయిన్)లో సమావేశం అయ్యారు. కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, షటిల్ పోటీలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లపై చర్చించారు.

తహసీల్దార్ల బదిలీలపై తర్జనభర్జన

... 5వ పేజీ తరువాయి

శివారు ప్రాంతంలో పనిచేసి ప్రస్తుతం నగరంలో పనిచేస్తున్న మరో తహసీల్దారు అనకాపల్లికి వెళ్లడానికి నిర్ణయించారు. అనకాపల్లి జిల్లా నుంచి ఇద్దరు మహిళా తహసీల్దార్లు నగరానికి రావడానికి అక్కడ అధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని తెలిసింది. కాగా విశాఖ జిల్లాలో పనిచేస్తున్న కొందరు తహసీల్దార్లపై ఉన్నతాధికారులు అసంతృప్తితో ఉన్నందున కనీసం ఇద్దరు లేదా ముగ్గురిని అనకాపల్లికి పంపాలని లేదా అప్రాధాన్య పోస్టుల్లో నియమించాలని భావిస్తున్నారు. మరో తహసీల్దార్ అయితే ప్రస్తుతం పనిచేస్తున్న మండలం నుంచి తప్పించాలని కోరుతున్నారు. కలెక్టరేట్‌లో పనిచేయడానికి సిద్ధపడినట్టు చెబుతున్నారు. మరో తహసీల్దారు విషయంలో కూటమికి చెందిన కీలక నేత ఒకరు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, సదరు అధికారిని ఏజెన్సీకి పంపాలని ఉన్నతాధికారులకు స్పష్టంచేశారని జోరుగా ప్రచారం జరుగుతుంది. కాగా బదిలీలకు ఈనెల 22 వరకు గడువు పొడిగించడంతో వచ్చే వారం ఉమ్మడి జిల్లా పరిధిలో ముగ్గురు కలెక్టర్లు భేటీ కానున్నారని, ఈ భేటీలో తహసీల్దార్ల బదిలీలపై ఒక నిర్ణయం తీసుకుంటారని తెలిసింది.

శభాష్ పోలీస్

... 5వ పేజీ తరువాయి

కారణమైన వాహనం గొలుగొండ మండలం గుండపాలలో వున్నట్టు గురువారం సాయంత్రానికి గుర్తించారు. పోలీసులు అక్కడకు వెళ్లి సరుగుడు తోటల్లో వుంచిన టాటా ఏస్ వాహనాన్ని స్వాధీనం చేసుకుని, డ్రైవర్ మర్రా రెడ్డిమయ్యను అదుపులోకి తీసుకున్నారు. కోమళ్లపూడి వద్ద బాలికను ఢీకొట్టిన తరువాత డ్రైవర్ నర్సీపట్నం వెళ్లకుండా, మధ్యలో రావికమతం మండలం చినపాచిల, మాడుగుల మండలం వమ్మలి, ఘాటీరోడ్డు మీదుగా పాడేరు వెళ్లాడని, అక్కడి నుంచి చింతపల్లి మండలం లోతుగెడ్డ మీదుగా సొంతూరు గొలుగొండ మండలం గుండుపాల చేరుకుని, వాహనాన్ని సరుగుడు తోటలో దాచిపెట్టాడని సీఐ కోటేశ్వరరావు వివరించారు. ఆయా మార్గాల్లో పలుచోట్ల వున్న సీసీ కెమెరాల పుటేజీల ఆధారంగా ప్రమాదం జరిగిన 24 గంటల్లోనే వాహనంతోసహా నిందితుడిని పట్టుకున్నామని చెప్పారు. ఈ కేసును 24 గంటల్లో ఛేదించినందుకు తనతోపాటు ఎస్ఐలు, పోలీసు సిబ్బందిని ఎస్పీ దీపిక అభినందించారని ఆయన తెలిపారు.

నిరుపయోగంగా మరుగుదొడ్లు

▸ మండల పరిషత్ కార్యాలయం సిబ్బందికి తప్పని ఇబ్బందులు



తుప్పల మధ్య ఉన్న మండల పరిషత్ కార్యాలయం మరుగుదొడ్లు

మాకవరపాలెం, సెప్టెంబరు 13 : స్థానికం ఎంపీడీవో కార్యాలయంవద్ద మరుగుదొడ్లు అధ్వానంగా ఉండడంతో ఇక్కడ పని చేసే ఉద్యోగులు, సిబ్బంది అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా మహిళా సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎంపీడీవో కార్యాలయం వద్ద రూ.2 లక్షలతో నిర్మించినా మరుగుదొడ్లు అసంపూర్తిగా నిలిచిపోయాయి. వీటికి నీటి సదుపాయం కల్పించలేదు. వీటిని పూర్తి చేసిన అందుబాటులోకి తీసుకురావడం లేదు. దీంతో ఎంపీడీవో కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది అవసరాల నిమిత్తం నియమించిన మరుగుదొడ్లు అందుబాటులోకి రాకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మహిళా ఉద్యోగులతో పాటు కార్యాలయాలకు వస్తున్న మహిళా ప్రజా ప్రతినిధులు మరుగుదొడ్ల లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్తగా నిర్మించిన మరుగుదొడ్లకు నీటి సదుపాయం లేకపోవడంతో పాటు చుట్టూ తుప్పలు పెరిగిపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యం

▸ ఎంపీడీవో జయప్రకాశరావు



సూచలిస్తున్న ఎంపీడీవో జయప్రకాశరావు

చీడికాడ, సెప్టెంబరు 13 : పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలని ఎంపీడీవో జయప్రకాశరావు అంగన్‌వాడీ సిబ్బందిని ఆదేశించారు. చెట్టుపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించి రికార్డులు పరిశీలించారు. పలు సలహాలు, సూచనలు అందించారు. అనంతరం వాటర్‌ట్యాంకును పరిశీలించి క్లోరినేషన్ చేయించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఆయనతో పాటు సర్పంచ్ గొర్లె గణేష్, తదితరులు పాల్గొన్నారు.

బి.కింతాడలో పారిశుధ్య నిర్వహణ



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్

దేవరాపల్లి, సెప్టెంబరు 13 : మండలంలోని బి.కింతాడలో చేపడుతున్న పారిశుధ్య పనులను ఎంపీడీవో చంద్రశేఖర్ శుక్రవారం పరిశీలించారు. సర్పంచ్ బాబూరావును అభినందించారు. పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అప్పారావు, వెంకటరావు, బొబ్బిలి రాము, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జాగారాల గెడ్డకు శాశ్వత పరిష్కారం

▸ స్పీకర్ అయ్యన్నకు జి.కోడూరు రైతుల వినతి



స్పీకర్ అయ్యన్నకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

మాకవరపాలెం, సెప్టెంబరు 13 : జాగారాలగెడ్డ గండివల్ల ప్రతి ఏటా పంటలు నష్టపోతామని, దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ జి.కోడూరు టీడీపీ నాయకులు మళ్ల జగన్నాథరావు ఆధ్వర్యంలో పలువురు రైతులు ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గెడ్డకు ఇరువైపులా ఆక్రమణలు అధికం కావడంతో ఈ పరిస్థితి నెలకొంటోందని వాపోయారు. దీనిపై స్పీకర్ వెంటనే ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. నోటీసులు జారీ చేసి ఆక్రమణలు తొలిగించాలన్నారు. అలాగే వెంటనే గెడ్డ గండి పనులు మొదలు పెట్టాలని అధికారులకు అయ్యన్నపాత్రుడు సూచించారు.

బీఎన్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి



ఆందోళన నిర్వహిస్తున్న ఆటో యూనియన్ నేతలు, సభ్యులు

రావికమతం, సెప్టెంబరు 13 : అడుగడుగునా శిథిలమై రాకపోకలకు ప్రమాదకరంగా మారిన నర్సీపట్నం-భీమునిపట్నం రోడ్డుకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ కొత్తకోట శ్రీశాంతి ఆటో యూనియన్ సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. దొండపూడి రాణా నుంచి కొత్తకోట వరకూ రాస్తారోకో నిర్వహించి ఆపై రోడ్డు గోతుల వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.బుల్లిబాబు, నాగు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో గోతులమయంగా మారి అధ్వానంగా తయారైందన్నారు. ఈ రోడ్డులో ప్రయాణం అంటేనే గుబులు కలుగుతోందన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలోనైనా రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు టోళ్లల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్‌తోనే వ్యవసాయ సంక్షేమ ఫలాలు



రైతులకు సూచనలిస్తున్న ఏవో భాస్కరరావు

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 13 : రైతులు తాము సాగు చేసే ప్రతి పంటను ఈ-క్రాప్ చేయించుకుంటేనే ప్రభుత్వం అందించే పథకాలకు అర్హత లభిస్తుందని ఏవో బి.భాస్కరరావు పేర్కొన్నారు. ఆయన శుక్రవారం పెదమదీనాలో వీఏఏలు చేపట్టిన ఈ-క్రాప్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ-క్రాప్ నమోదు చేసే పంటల వివరాలను సింగిల్ సోర్స్ ఆఫ్ ట్రూత్‌గా పరిగణించి, ఈ డేటా ఆధారంగా వ్యవసాయ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయనున్నట్టు తెలిపారు. మండలంలో 16 వేల ఎకరాల్లో సాగుకు అంచనా కాగా, ఇప్పటి వరకు 9600 ఎకరాల్లో సాగు ఈ-క్రాప్ చేసినట్టు తెలిపారు. మిగిలిన రైతులు ఈ నెల 15లోగా ఈ-క్రాప్ తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో స్పష్టం చేశారు.

డివార్మింగ్ విజయవంతం చేయండి : ఎంపీడీవో



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో హనుమంతరావు

నాతవరం, సెప్టెంబరు 13 : ఈ నెల సెప్టెంబరు 17న నిర్వహించే జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో ఎన్.హనుమంతరావు కోరారు. శుక్రవారం నాతవరం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో కలిసి ఆయన జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏవో పి. పార్థసారథి, ఈవోపీఆర్డీ ఎస్వీఎన్ మూర్తి, నాతవరం, గునుపూడి ఆరోగ్య కేంద్రాల ఎంపీహెచ్‌వోలు నాగేశ్వరరావు, కోరుప్రోలు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వ్యాయామశాల



వ్యాయామం చేస్తున్న విద్యార్థులు

నర్సీపట్నం, సెప్టెంబరు 13 : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని వ్యాయామశాల ఎట్టకేలకు అందుబాటులోకి వచ్చింది. 2018లో టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న అయ్యన్నపాత్రుడు చొరవతో కళాశాలలో సుమారు రూ.10 లక్షలతో జిమ్ పరికరాలు అమర్చారు. వాటిని వినియోగించక, నిర్వహణ సరిగా లేకపోవడం వంటి కారణాలతో జిమ్ పరికరాలు మరమ్మతులకు గురయ్యాయి. ఇటీవల డిగ్రీ కళాశాలను సందర్శించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాయామశాలను పరిశీలించారు. సామగ్రి పని చేయడం లేదని అక్కడ అధికారులు చెప్పడంతో మరమ్మతులు చేయించి యువతకు తిరిగి అందుబాటులోకి తెచ్చారు.

90 మందికి వైద్య పరీక్షలు

నాతవరం, సెప్టెంబరు 1 : మండలంలోని వైబీ అగ్రహారంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోసూరి విజయ్ మాట్లాడుతూ ఈ సీజన్‌లో వైద్యులు సూచించిన జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఈ శిబిరంలో 90మంది రోగులకు డాక్టర్ చక్రధర్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ జి.వెంకటలక్ష్మీ హెల్త్ ఎంపీహెచ్ఈవో సీహెచ్ నాగేశ్వరరావు, సూపర్‌వైజర్ టి.శాంసన్ ఎఎన్ఎం లక్ష్మీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

☛ సంక్షిప్తంగా..

ఎస్ఐలు బాధ్యతల స్వీకారం



లక్ష్మీనారాయణ

కె.కోటపాడు, సెప్టెంబరు 13 : ఏ.కోడూరు నూతన ఎస్ఐగా డి.లక్ష్మీనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కె.కోటపాడు నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. కాగా ఇప్పటి వరకు ఇక్కడ ఎస్ఐగా పని చేసిన జె.రమేష్ అనకాపల్లి జిల్లా క్రైమ్ రికార్డు బ్యూరో (డీసీఆర్‌బీ)గా బదిలీ అయ్యారు.



రామకృష్ణారావు

రోలుగుంట : రోలుగుంట ఎస్సైగా నియమితులైన పి.రామకృష్ణారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్సైగా పని చేస్తున్న సురేష్ కొయ్యూరు మండలం మంపకు బదిలీ అయ్యారు.

కృష్ణాదేవిపేటకు తొలిసారిగా మహిళా ఎస్ఐ



ఎస్ఐ దివ్య

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 13 : గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట ఎస్ఐగా టి.దివ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ పోలీస్ స్టేషన్‌లో మహిళా ఎస్ఐ నియామకం కావడం ఇదే ప్రథమం. ఇప్పటి వరకు ఏడాదిన్నర ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్ఐ ఎం.ఉపేంద్ర బదిలీపై యలమంచిలి రూరల్ ఎస్ఐగా వెళ్లారు.

ఉచితంగా ఇసుక అందించాలి

కలెక్టర్‌కు మాజీ ఎమ్మెల్యే ఉమాగణేశ్ వినతి

నర్సీపట్నం, సెప్టెంబరు 13 : గృహ నిర్మాణదారులకు ఉచిత ఇసుకను సరఫరా చేయాలని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ జిల్లా కలెక్టర్‌ను కోరారు. శుక్రవారం వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు పంపించినట్టు చెప్పారు. గత ప్రభుత్వంలో నూతన ఇసుక విధానంలో భాగంగా గబ్బాడలో ఇసుక నిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇసుక అందుబాటులో లేక గృహ నిర్మాణాలు ఆగిపోయి వేలాది మంది భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడుతున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామని హామీ ఇచ్చినందున గబ్బాడలోని వేల టన్నుల ఇసుకను ప్రజలకు ఉచితంగా అందజేయాలని కోరారు.

ఓజోన్ పరిరక్షణపై వ్యాస రచన పోటీలు

నర్సీపట్నం, సెప్టెంబరు 13 : గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ నెల 16న ఓజోన్ పరిరక్షణ దినోత్సవంలో భాగంగా ఓజోన్ పొర ప్రాముఖ్యత- దాని పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు అంశంపై జూనియర్స్, సీనియర్స్ విభాగంలో విద్యార్థులు వ్యాస రచన పోటీలలో పాల్గొన్నారు. ఈ నెల 16న నర్సీపట్నంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నామని గ్రీన్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు డీజీనాథ్ తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



హెచ్ఎం రవీంద్రబాబును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 13 : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న తురకలపూడి జడ్పీ హైస్కూల్ హెచ్ఎం జె.రవీంద్రబాబును శుక్రవారం ఉపాధ్యాయులు సన్మానించారు. శాలువా కప్పి జ్ఞాపకను అందజేశారు. ఈ కార్యక్రమంలో నోబుల్ టీచర్ అసోసియేషన్ అధ్యక్షులు టీవీ రమణ, ఉపాధ్యాయుడు పి.కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

కాజ్‌వే పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఏఈ సాయిశ్రీనివాస్

చీడికాడ, సెప్టెంబరు 13 : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయిన మండలంలోని ఖండివరం సమీపంలో గల మోసూరివారి కళ్లాల వద్ద కాజ్‌వేను శుక్రవారం ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించారు. మాడుగుల ఆర్ అండ్ బీ ఏఈ సాయిశ్రీనివాస్ కాజ్‌వేలో తాత్కాలికంగా మదుమును ఏర్పాటు చేసి శుక్రవారం పనులు పూర్తి చేయించారు. ప్రస్తుతం రవాణాకు ఎటువంటి ఇబ్బంది లేదన్నారు. ఆయనతో పాటు ఖండివరం పంచాయతీ కార్యదర్శి వీర్రాజు పాల్గొన్నారు.

అంధకారంలో రామచంద్రపురం

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 13 : గొలుగొండ మండలం లింగంపేట పంచాయతీ శివారు రామచంద్రపురంలో నెలల తరబడి వీదిలైట్లు లేక గ్రామం అంధకారంలో ఉందని జనసేన మండల ఉపాధ్యక్షుడు, గ్రామ ఉప సర్పంచ్ లంక సత్యనారాయణ తెలిపారు. ఈ విషయమై పలుమార్లు పంచాయతీ కార్యదర్శి అప్పారావుకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శివారు గ్రామం కావడంతో వీధిలైట్లు లేక తుప్పల్లో విషసర్పాలుతో పాటు వీధికుక్కల దాడులకు గురవుతున్నట్టు గ్రామస్తులు వాపోతున్నారు. ఈ సమస్యపై డివిజన్, జిల్లా స్థాయి అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని లేదంటే గ్రామస్తులతో ఆందోళన చేస్తామని సత్యనారాయణ హెచ్చరించారు.

మండలంలో మోస్తరు వర్షం..

మాడుగుల రూరల్, సెప్టెంబరు 13 : మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం మోస్తరు వర్షం పడింది. గత రెండు రోజులుగా ఎండతీవ్రత ఎక్కువగా ఉంది. మధ్యాహ్న సమయాల్లో వేడిమికి తట్టుకునేందుకు ప్రజలు ఇబ్బంది పడ్డారు. కాగా, శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎండ కాసింది. ఆ తర్వాత ఒక్కసారిగా వర్షం పడడంతో జనం ఉపశమనం పొందారు.